

ధరాభారం

ఉల్లి ఘాటెక్కింది.. టమాటా ధర ఆకాశమే హద్దుగా పెరుగుతోంది.. మిగిలిన కాయగూరలన్నీ అదే బాటలో ఉన్నాయి. మార్కెట్‌కు వెళ్లి కొందామంటే ధరలు ప్రజలకు షాక్‌ను ఇస్తున్నాయి. వరదల్లో కాయగూరల పంటలు అన్నీ దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు చెబుతున్నారు. మరో మూడునెలలపాటు ఇదే స్థాయిలో ధరలు ఉంటాయని మార్కెట్‌వర్గాలు భావిస్తున్నాయి.



- ఘాటెక్కిన ఉల్లి... కిలో ధర రూ.70
- సెంచరీకి చేరువలో టమాటా ధరలు
- అదే బాటలో ఇతర కాయగూరలు
- సామాన్యులకు తప్పని ఇక్కట్లు
- మరో మూడు నెలలు ఇదే పరిస్థితి ఉంటుందంటున్న మార్కెట్‌వర్గాలు

పిఠాపురం, అక్టోబరు 6: జిల్లాలో కాకినాడతోపాటు పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లోని మార్కెట్‌ల్లో ధరలు మండిపోతున్నాయి. బహిరంగ మార్కెట్లలో కాయగూరల ధరలన్నీ అర్ధ సెంచరీ దాటి సెంచరీకి చేరువవుతున్నాయి. ధరలు పెరిగిపోవడంతో ప్రజలకు ఇబ్బందులకు తప్పడం లేదు. కార్తీకమాసంలో కాయగూరల ధరలు అధికంగా ఉంటాయి. అందుకు భిన్నంగా ఈసారి నెలరోజులు ముందుగానే ధరలు పెరగడం ప్రారంభించాయి. ధరలు పెరుగుతుండడంతో వినియోగదారులు కలవరానికి గురవుతున్నారు.

రూ.70కి చేరువలో ఉల్లి



ఉల్లి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం నాణ్యత కలిగిన ఉల్లి ధర కిలో రూ.60-70 వరకూ ఉంది. కర్నూలుతోపాటు కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అధిక వర్షాల కారణంగా ఉల్లిపంట దెబ్బతింది. దీంతోపాటు ఉల్లి ఎగుమతులు ఎత్తివేయడంతో ధరలు పెరగడం ప్రారంభించాయి. సాధారణంగా ఈ సమయంలో ఉల్లి ధర రూ.40-రూ.50 మధ్య ఉంటుంది. ఈసారి మాత్రం అందుకు భిన్నంగా రూ.70కి చేరింది. ఇది రూ.100లకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు మండలంతోపాటు ఇతర ప్రాంతాల్లో వేసిన ఉల్లి, కర్నూలు, మహారాష్ట్రల నుంచి ఉల్లిపంట రావడం డిసెంబరులో ప్రారంభమవుతుందని వ్యాపారవర్గాలు తెలిపాయి. ఆ తర్వాతే ధరలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

టమాటా బాంబు



ప్రతి వంటకంలోనూ వినియోగించే టమాటా ధర ఆకాశమే హద్దుగా పెరిగిపోతోంది. వారంరోజుల వ్యవధిలోనే కిలో టమాటా ధర రూ.40 నుంచి రూ.80-100కు చేరింది. మరింత పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్తున్నారు. జిల్లాలోని గొల్లప్రోలు, పిఠాపురం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, గండేపల్లి, జగ్గంపేట మండలాల్లోనూ, కర్నూలు, చిత్తూరు తదితర జిలాల్లో వేసిన టమాటా పంట తుఫాన్లు, భారీవర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్నాయి. పంటపూర్తిగా తుడుచుకుపెట్టుకుపోయింది. దీంతో ఇతర రాష్ట్రాలనుంచి, కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసిన సరుకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. దీనివల్ల ధరలు పెరుగుతున్నాయని తెలుస్తోంది. ఉల్లి, టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో అవి వంటకాల్లో కనిపించ డం తగ్గింది. హోటళ్లు, ఇతర వంటకాల్లో టమాటాను ఎక్కువగా వినియోగిస్తారు. ఇప్పుడు రేటు పెరగడంతో టమాటా వినియోగాన్ని తగ్గించారు.

డిమాండ్ అధికం

దసరా శరన్నవరాత్రులు ప్రారంభమైన నాటినుంచి కాయగూరలకు డిమాండ్ పెరుగుతోంది. ఇదే భవానీ భక్తులు, అయ్యప్పమాల, శివమాల తదనంతరం దత్తమాల ధరించే భక్తులు అధికంగా ఉంటారు.కార్తీకమాసం నెలరోజులు ఎక్కువమంది కాయగూరలు (శాకాహారం) మాత్రమే తింటారు. ఈ సమయంలో కాయగూరలకు డిమాండ్ ఎక్కువ. సాధారణ రోజులు కంటే రెండు రెట్లు అధికంగా కాయగూరల విక్రయాలు జరుగుతాయి. ఈసారి పంటలు వరదలకు దెబ్బతిన్న నేపథ్యంలో డిమాండ్ పెరిగిన వెంటనే ధరలు పెరగడం ప్రారంభమయ్యాయి.

కాయగూరలదీ అదే పరిస్థితి

ఉల్లి, టమాటాలతోపాటు కాయగూరల ధరలన్నీ మండుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో బీరకాయలు కిలో రూ.60 ఉండగా దొండకాయలు రూ.50-60, బెండకాయలు రూ.40-60, వంకాయలు రూ.50-70, చిక్కుళ్ల రూ.60, బీట్రూట్ రూ.45-55, క్యారెట్ రూ.50-60, ఆగాకర కిలో రూ.100, పచ్చిమిర్చిరూ.40-60, అల్లం రూ.80 ఉంది. ములక్కా డ ఒకటి రూ.10 ఉండగా అరటి అదేస్థాయిలో ఉంది. కొత్తిమీర, తోటకూర, గోంగూర, పాలకూర తదితర ఆకుకూరలు ధరలు పెరిగాయి. గతంకంటే మూడు, నాలుగు రెట్లు ధరలు అధికంగా ఉన్నాయంటున్నారు.

అమ్మవారి అలంకారాలు



సామర్లకోటలో లలితాదేవి అవతారంలో బాలాత్రిపురసుందరి అమ్మవారు



తుని లోవ ఆలయంలో లలితా త్రిపుర సుందరి అవతారంలో తలుపులమ్మ అమ్మవారు



పిఠాపురం పాదగయలో త్రిపుర భైరవి అవతారంలో పురుహూతికా అమ్మవారు

అడవిలో.. వేట



గండేపల్లి మండలం కె.గోపాలపురంలోని అటవీ ప్రాంతం

అడవిలో వేట.. జిల్లా పరిధిలోని అటవీప్రాంతంలో వన్యప్రాణుల వేట జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ ఉచ్చులను బిగించి జంతువులను వేటాడి.. ఆ మాసం మైదాన ప్రాంతాల్లో కిలోల లెక్కన అమ్ముతున్నారన్న విమర్శలున్నాయి. ఈ విద్యుత్ ఉచ్చుల వల్ల మనుషుల ప్రాణాలు పోతున్నాయని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వన్యప్రాణుల వేటకు అడ్డాగా మారుతున్న అటవీ ప్రాంతాలు
- గండేపల్లి, జగ్గంపేట, గోకవరం, ప్రత్తిపాడుల్లో వందల ఎకరాల్లో ఫారెస్టు
- టేకు, జామ, పాల చెట్లు మాయమవుతున్నట్టు ఆరోపణలు

గండేపల్లి, అక్టోబరు 6: జిల్లాలోని గండేపల్లి మండలం కె.గోపాలపురంలో కోగిద రిజర్వుఫారెస్టు ఉంది. వెయ్యి ఎకరాల్లో విస్తరించి ఉన్న అడవి చుట్టుపక్కల గండేపల్లి మండలం కె.గోపాలపురం, సుబ్బయ్యమ్మపేట, ఎన్జీరాజాపురం, జగ్గంపేట మండలంలో మల్లిశాల, గోకవరం మండలం గోకవరం, వీరలంకపల్లి, తిరుమలాయపాలెం గ్రామాలను ఆనుకుని ఉంది. ఈ అడవి అంతా దట్టమైనదిగా ఉంటుంది. లోనికి వెళ్లడానికి ఎవరూ సాహసించరు. ఈఅటవీ ప్రాంతం బయటకు దట్టమైన చెట్లతో కనిపిస్తున్నా లోన అంతా చెట్ల మొదల్లే ఉన్నట్లు సమాచారం. ఈ దట్టమైన అడవిలో వన్యప్రాణులను వేటాడానికి వేటగాళ్లు ఫారెస్టుకు దగ్గరగా వ్యవసాయ బోర్ల నుంచి, అడవి పరిధిలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్ల ద్వారా వేటాడుతున్నట్లుగా ఆరోపణలువినిపిస్తున్నాయి. తుపాకులతో వేటాడడం, వన్యప్రాణులు వెళ్లే దారులను గుర్తించి అక్కడ ఉచ్చు పెట్టి వన్యప్రాణులను భారీగా వేటాడుతున్నట్లు తెలుస్తోంది. అలా వేటాడిన జంతువులను అక్కడే మాంసంగా మార్చి రాత్రి సమయాల్లో గ్రామాల్లోకి వచ్చి అమ్మకాలు చేపడుతున్నట్లు విస్తృతస్థాయి సమాచారం. కె.గోపాలపురం పరిసర ప్రాంతాల్లో నిత్యం వేట మాంసం లభ్యమవుతున్నట్లు సమాచారం. అడవిలో అరుదుగా దొరికే టేకు, జామాయిల్, పాల చెట్లు మాయమవుతున్నట్లు సమాచారం. అడవిలో ఇంత జరుగుతున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు తూతూమంత్రంగానే చర్యలు తీసుకుంటున్నారే తప్ప పూర్తిస్థాయిలో అక్కడ ఏం జరుగుతుందో పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి.

సబ్‌ప్లాన్ ఏజెన్సీలో కరెంటు ఉచ్చులు



ప్రత్తిపాడు మండలం పాదురుపాకలో విద్యుత్ తీగల ఉచ్చు

ప్రత్తిపాడు, అక్టోబరు 6: ప్రత్తిపాడులోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలతోపాటు కొండ కోనలు ఉన్న మైదాన గ్రామాల్లో కూడా వన్యప్రాణుల వేట యథేచ్ఛగా జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వన్యప్రాణులను హతమార్చేందుకు ఏర్పాటు చేస్తున్న కరెంటు ఉచ్చులకు అమాయక ప్రజలు బలవుతున్నారు. ఈ పరిస్థితి ఇటీవల మరీ ఎక్కువకావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనప్రాంతాల్లో అడవి పందులు, జింకలు దుప్పిలు వంటి వన్యప్రాణులను కొందరు వేటాడడమే వృత్తి చేసుకుని అక్రమ వన్యప్రాణుల మాంసం విక్రయాలకు పాల్పడుతున్నారు. అడవుల్లో ఉండే వన్యప్రాణులు ఆహారం కోసం సమీప మైదాన గ్రామాలు, కొండలపైకి రావడాన్ని గుర్తించిన కొందరు వాటిని నిర్దాక్షిణ్యంగా వేటాడి చంపుతున్నారు. వీటిని వేటాడంకోసం పంట పొలాల గుండా వెళ్లే విద్యుత్ స్థంభాల వైర్లకు కరెంటు కనెక్షన్లు ఇచ్చి వన్యప్రాణులు వేటాడేందుకు ఉచ్చు ఏర్పాటు చేస్తున్నారు. పంటపొలానికి చుట్టూ పెన్షన్ మాదిరిగా ఇనుప కంచెను ఏర్పాటు చేసి దానికి విద్యుత్ స్తంభం నుంచి వెళ్లే వైరుకు కనెక్షన్ ఇవ్వడం ద్వారా అక్రమ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. దీనివల్ల పొలంచుట్టూ ఉండే ఇనుప కంచెను వన్యప్రాణులు తాకి అక్కడ మృత్యువాత పడతున్నాయి. వీటిని వెంటనే గ్రామాల్లోకి తరలించి కిలో అడవి పంది మాంసం రూ.200 నుంచి రూ.300, దుప్పి మాంసం కిలో రూ.600 నుంచి రూ.800 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. వన్యప్రాణులకోసం పొలాల్లో ఏర్పాటు చేసే ఈ విద్యుత్ కంచెలను గమనించకుండా ఉదయం పొలం పనులకు వెళ్లే అమాయకులు ఈ కంచెను తాకి విద్యుదాఘాతానికి గురై మృతి చెందుతున్నారు. గతంలో పెద్దిపాలెం, ధారపల్లి, పోతులూరు గ్రామాల్లో ముగ్గురువ్యక్తుల ఈ ఉచ్చులు తగిలి మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. ఉత్తరకంచి, శాంతి ఆశ్రమం ఫీడర్‌పై విద్యుత్ ఉచ్చులకు తరచూ వన్యప్రాణులు పడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ ఉచ్చులతో వేట నిలిపివేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మెట్టలో గుట్టుగా..
ఇసుక అక్రమ రవాణా



జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలంలో దాదాపు ఖాళీ అయిన ఇసుక గుట్ట

- గత ప్రభుత్వంలో ఏడీబీ రోడ్డుకు కేటాయించిన ఇసుక అక్రమార్కుల చేతుల్లోకి..
- 800 ట్రిప్పుల ఇసుక కనుమరుగు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

జగ్గంపేట, అక్టోబరు 6: జిల్లాలోని మెట్టప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోందని సమాచారం. గత ప్రభుత్వంలో ఏడీబీ రోడ్డు పనులకోసం కేటాయించిన ఇసుక గండేపల్లి మండలంనుంచి అక్రమార్కుల చేతుల్లోకి చేరిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 800 ట్రిప్పుల వరకు ఉండే ఇసుక ప్రస్తుతం తగ్గుతూ వస్తోంది. బీఎస్సార్ కంపెనీ ప్లాంటు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా టిప్పర్లు, లారీల్లో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారని సమాచారం. పక్క నియోజకవర్గంలోని ఓ పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఈ ఇసుకను తరలించుకుపోతున్నట్లు సమాచారం. ఇక్కడినుంచి ఇసుక జిల్లాలోని పిఠాపురం, కత్తిపూడి ప్రాంతాలకు తరలిపోతోంది. కొన్నిరోజులుగా ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో మట్టి మాఫియా చెలరేగిపోయి అక్రమాలకు పాల్పడితే ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పరిస్థితి మారుతుందని ప్రజలు ఆశపడ్డారు. కానీ మళ్లీ అక్రమార్కులు తమ తీరు ఏ మాత్రం మార్చకుండా యథావిధిగా ఇష్టారీతిన మట్టి, ఇసుక ఇలా ఏది కనిపిస్తే దాన్ని మాయం చేసే పనిలో ఉన్నారు. అధికారులు కూడా చూసీచూడనట్టు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. ఇంత పెద్ద మొత్తంలో ఇసుక తరలించుకుపోతోంటే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు ముడుపులు అందాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంతో కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశముందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే అక్కడున్న ఇసుక మొత్తం కనుమరుగయ్యే అవకాశముంటుందని అంటున్నారు.

కిర్లంపూడిలో ఇసుక తరలిస్తున్న దళారులు

కిర్లంపూడి, అక్టోబరు 6: కిర్లంపూడి మండలంలోని శృంగరాయునిపాలెంలో ఏలేరు కాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో బెడ్‌రెగ్యులేటర్‌వద్ద ఏలేరు కాలువలో ఇసుకను తవ్వి రెండెడ్ల బండిపై తీసుకొచ్చి ఖాళీ ప్రదేశాల్లో పోగులు చేసుకుని ట్రాక్టర్లపై ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని వాపోయారు. ఇటీవలకాలంలో ఏలేరు కాలువ వరద ప్రవాహం అధికంగా రావడంతో ఇసుక మేటలుగా ఏర్పడ్డాయి. దీంతో జోరుగా ఇసుకను తరలించేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఏలేరు కాలువలో ఇసుక అంతా అమ్ముకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా లోతుగా తవ్వి ఇసుక తరలిస్తుండడంతో కాలువల్లో గోతులు ఏర్పడుతున్నాయని, వీటివల్ల ప్రమాదాల జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేషన్ కందిపప్పు.. రాలేదంతే!



- పక్కదారి పట్టించిన డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు

సామర్లకోట, అక్టోబరు 6: ప్రభుత్వం అక్టోబరు నెల నుంచి రేషన్‌కార్డుదారులకు బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార కిలో చొప్పున రెండు సరుకులు పంపిణీ చేస్తామని ఎంతో అట్టహాసంగా ప్రకటించినా క్షేత్రస్థాయిలో బియ్యం, పంచదార మినహా కందిపప్పు పంపిణీ చేయకుండా పక్కదారి మళ్లించినట్లు కార్డుదారులు వాపోతున్నారు. మూడురోజులుగా సామర్లకోట మండలంలోనూ, పట్టణంలోనూ ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషన్‌సరుకులు పంపిణీ చేస్తుండగా క్షేత్రస్థాయిలో కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో పలువురు కార్డుదారులు ఎండీయూ ఆపరేటర్లను ప్రశ్నించగా ఈనెల కోటాలో కందిపప్పు రాలేదని, పంచదార, బియ్యం మాత్రమే వచ్చాయని చెప్తున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.160నుంచి రూ.170 వరకూ ధర ఉండడంతో రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కై ప్రభుత్వం ఎలాట్‌మెంట్ చేసిన కందిపప్పును పక్కదారి మళ్లించినట్లు తెలిసింది. ప్రభుత్వం ఇటీవలకాలంలో తొలిసారిగా రేషన్‌దుకాణాల్లో కందిపప్పు పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించడంతో కార్డుదారులు ఎంతో ఆశగా ఎండీయూ వాహనం రాకకోసం ఎదురు చూడగా బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేయడంతో ఆశ్చర్యపోతున్నారు. ఇటీవలకాలంలో పంపిణీ నిలిచిపోయిన కందిపప్పు తిరిగి సరఫరా పునరుద్ధరించడంతో ఎంఎస్వో అధికారి పంపిణీ తీరును పర్యవేక్షించాల్సి ఉంది. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎంఎస్వో అధికారి పర్యవేక్షణ చేయలేనట్లు తెలిసింది.

సామర్లకోట మండలంలోనూ, పట్టణంలోనూ 75 రేషన్‌దుకాణాల ద్వారా 44,341 కార్డుదారులకు 44,341 కిలోల కందిపప్పును సరఫరా చేయాల్సిఉంది. సామర్లకోట మండలానికి ఎంతమేర స్టాక్ ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చేరుకుందో అంతుచిక్కని రహస్యంగా అధికారులు గోప్యత ప్రదర్శిస్తుండడం గమనార్హం. తక్కువ ఎలాట్‌మెంట్ సాకుతో మంజూరైన కందిపప్పును సైతం పక్కదారి మళ్లించినట్లు తెలిసింది. దీనిపై కందిపప్పు పంపిణీలో ఎండీయూ ఆపరేటర్లు చెబుతున్న దానికి, అధికారులు చెబుతున్న దానికీ వ్యత్యాసం కనిపిస్తోంది. దీనిపై ఎంఎస్వో కమలకుమారిని వివరణ కోరగా మండలంలో అన్ని రేషన్ దుకాణాలకు కందిపప్పు ఎలాట్ చేశామని, ఎక్కడ పంపిణీ చేయలేదో తెలుసుకుంటామని చెప్పడం గమనార్హం. దీంతో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డిని వివరణ కోరగా మొదటి విడతగా ప్రతి రేషన్ దుకాణానికి 30కిలోల చొప్పున కందిపప్పు ఎలాట్ అయ్యిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి పంపిణీ చేయని వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పిఠాపురం అర్బన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో కూటమి విజయం

- నాలుగు స్థానాల్లో కూటమి, ఒక స్థానంలో ఇండిపెండెంట్ గెలుపు
- మర్రెడ్డి, పెండెంలను కలిసిన 1వ వార్డు డైరెక్టర్ రాంబాబు



కూటమి అభ్యర్థులతో ఎంపీ ఉదయశ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 6: ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనికి జిల్లా అధికారులు హాజరుకావాలన్నారు.

లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన కాకినాడ పోర్టు కస్టమ్స్ అధికారి


మొదటిపేజీ తరువాయి



కూష్మాండ రూపంలో అపర్ణాదేవి

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం విశేష పూజలు జరిగాయి. అపర్ణా అమ్మవారిని కూష్మాండదేవి రూపంలో డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి అలంకారం జరిపి కుంకుమ పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- గొల్లప్రోలు రూరల్



సహస్ర దీపాల వెలుగులో ఊయలలో దుర్గామల్లేశ్వరి

పిఠాపురం రూరల్, అక్టోబరు 6: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం రాపర్తిలో వేంచేసియున్న దుర్గామల్లేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సహస్ర దీపాల మధ్య అమ్మవారి ఊయల సేవ భక్తులను తన్మయత్వంలో ముంచెత్తింది. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గాజుల అలంకారంలో విజయదుర్గ అమ్మవారు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం చిన కొత్తలంకలో విజయదుర్గ అమ్మవారిని ఐదు వేల గాజులతో విశేషంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- ముమ్మిడివరం



వారాహి దివ్య అలంకరణలో ఐశ్వర్యాంబిక

మహాశక్తి యాగంలో నాలుగో రోజు సౌభాగ్య పూజ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 6: కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం ఆదివారం నాలుగో రోజుకు చేరింది. శత కోటి కుంకుమార్చన 29 కోట్లకు చేరుకుంది. స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో శతకోటి కుంకుమార్చనలు, లలిత పారాయణ నిర్వహించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారికి వారాహీ దేవిగా దివ్యాలంకరణ చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్త్రీమూర్తుల సౌభాగ్యం కోసం సౌభాగ్య పూజతో పాటు అర్గళ, కీలక, వారాహి హోమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు స్వామీజీ అనుగ్రహభాషణ చేశారు. వారాహి అంటే లలితా స్తోత్రంలో విశుక్ర ప్రాణహరణ వారాహీ వీర్యనందిత అని అర్థమన్నారు. వారాహి గొప్ప శక్తివంతురాలని, అంతటి శక్తివంతులైన అమ్మవారి అలంకరణ శ్రీపీఠంలో జరగడం చారిత్రకమన్నారు. ప్రతి ఒక్కరి హృదయంలో దైవం, ధర్మం, దీక్ష అనే గొప్ప సంకల్పం ఉందో దానిని వెలికితీసేందుకు ఈ మహాశక్తి యాగం మరింత దోహదం చేస్తుందన్నారు. సుమారు 30వేల మంది మాతృమూర్తులు శత కోటి కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణ పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



హోమ క్రతువులో వేద పండితులు



లలితాదేవి అవతారంలో దుర్గాదేవి

తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరులో దేవీ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఏడీబీ రోడ్డులో వున్న శ్రీవిజయదుర్గాదేవిని ఆదివారం అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. అమ్మవారు శ్రీలలితాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు చేశారు.

- రంగంపేట

శ్రీమహాలక్ష్మీదేవిగా దేవీచౌక్ అమ్మవారు



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 6: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీబాలాత్రిపురసుందరీ దేవి అమ్మవారు భక్తులకు శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో దేవీచౌక్ కూడలి జనసంద్రమైంది. కంబాలచెరువు, గోకవరం బస్టాండు, ఇటు రామచంద్రరావుపేట, లక్ష్మీవారపుపేట, జాంపేట రహదారులు భక్తులతో సందడిగా మారాయి. భారీ సెట్టింగులు, విద్యుత్ దీపాలంకరణలను చూసి చిన్నారులు ఉత్సాహంగా గడిపారు. ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు జరిపి మంగళ హారతి ఇచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి పది గంటలకు భీమవరం ఘంటసాల ఆర్కెస్ట్రా సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆదిత్య ఎస్ఎస్ఎస్ పీవో డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో వలంటీర్లు సేవలు అందిస్తున్నారు.



మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శారదాదేవిగా రత్నగిరి వనదుర్గమ్మ



అన్నవరం, అక్టోబరు 6: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు ఆదివారం శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహించారు.

నేటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

కాకినాడ సిటీ, అక్టోబరు 6: జాతీయ తపాలా వారోత్సవాలను సోమవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 7న తపాలా పార్సిల్ సేవల్లో వచ్చిన మార్పులు, విదేశాలకు పార్సిల్స్ పంపడానికి ప్రారంభించిన సేవలు, మరింత మెరుగైన ఉత్తరాల బట్వాడా కోసం అవగాహన కల్పిస్తామన్నారు. 8న ఫిలాటలీ దినోత్సవం సందర్భంగా డాయ అఖర్ ఉత్తరాలు, క్విజ్ పోటీలు జరుపుతామన్నారు. 9న అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా మాతృమూర్తి పేరున 'ఒక మొక్క' అంశంపై మొక్కలు నాటుతామన్నారు. 10న రాజవొమ్మంగి, పిఠాపురం, జి.మామిడాడ, సామర్లకోట కార్యాలయాల్లో ఆధార్ నమోదు మార్పులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. 11న సామాన్యులకు ఆర్థిక తపాలా జీవిత బీమా పాలసీలు, ఐపీపీబి సేవలపై అవగాహన కల్పించి కొత్త ఖాతాలు ప్రారంభిస్తామని చెప్పారు.

జాతీయ స్థాయిలోనూ రాణించాలి

» హెక్వేర్ డివోస్ ప్రాక్టీస్ సంస్థ ఉపాధ్యక్షుడు వినోద్‌వర్మ » దివాన్‌చెరువు 'శ్రీప్రకాష్'లో ముగిసిన సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్ పోటీలు

దివాన్‌చెరువు, అక్టోబరు 6: జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లోనూ బాగా రాణించి విజయాలు సొంతం చేసుకోవాలని బెంగళూరుకు చెందిన హెక్వేర్ డివోస్ ప్రాక్టీస్ సంస్థ ఉపాధ్యక్షుడు జి.వినోద్‌వర్మ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో నాలుగు రోజులు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఆతిథ్య పాఠశాల శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టరు సీహెచ్ విజయప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన వినోద్ వర్మ మాట్లాడుతూ క్రీడాకారులకు అంకితభావం, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరం అన్నారు. మన దేశం తరపున జెర్సీ వేసుకుని ఆడే స్థాయికి మీ క్రీడా ప్రయాణం సాగాలని విజేతలకు ఉద్బోధించారు. విశిష్ట అతిథి, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టరు విజయప్రకాష్ మాట్లాడుతూ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడాకారులు తరచూ క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. విజయం సొంతమైతే అది ప్రేరణ అవుతుందని చెప్పారు. ఒకవేళ ఓటమి ఎదురైనా నిరాశ చెందకూడదని, దానిని సాధనగా భావించి విజయం వైపు పయనించాలన్నారు. విజేతలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆశీర్వదించారు. కో-ఆర్డినేటర్ ఎం.గంగాధర్ మాట్లాడుతూ ప్రథమ స్థానంలో నిలిచిన వారు ఈ నెల చివరి వారంలో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.వెంకట్,సీబీఎస్ఈ పరిశీలకుడు పీపీ కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజరు ఏఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. విజేతలకు పతకాలు, కప్‌లను అతిథులు అందజేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోచ్‌లు, పీడీలు, క్రీడాకారులు మాట్లాడుతూ శ్రీప్రకాష్ పాఠశాలలో పోటీలు నిర్వహించిన విధానాన్ని కొనియాడారు.

విజేతలు వీరే: అండర్-14లో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యానికేతన్ (ప్రథమ), రంగారెడ్డి జిల్లా ఫార్చ్యూన్‌బటర్‌ఫ్లై పాఠశాల (ద్వితీయ), విజయవాడ హీల్ స్కూలు, చిత్తూరు శ్రీభానోదయ స్కూలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.

అండర్-17లో రంగారెడ్డి జిల్లా ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూలు (ప్రథమ), ఖమ్మం గోర్కీ పబ్లిక్ స్కూలు (ద్వితీయ), హైదరాబాద్ ప్రగతి సెంట్రల్ స్కూలు, నాచారం ఢిల్లీ పబ్లిక్‌స్కూలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.



బహుమతి ప్రదానోత్సవ సభలో విజేతలతో అతిథులు

అండర్-19లో విజయవాడ హీల్ స్కూలు (ప్రథమ), నెల్లూరు అక్షర విద్యాలయ (ద్వితీయ), రంగారెడ్డి ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూలు, హైదరాబాద్ ఎక్సిలేన్షియా స్కూలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ఆయా జట్ల సభ్యులు పతకాలు, బహుమతులు అందుకున్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్

దివాన్‌చెరువు, అక్టోబరు 6: ఏపీ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 బాలురు హ్యాండ్‌బాల్ రాష్ట్ర టోర్నమెంటు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి ఆదివారం తెలిపారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ క్రీడా మైదానంలో సోమవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు జరిగే క్రీడలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించామని స్వామి చెప్పారు.



పార్వతికి బంగారు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ నరసింహం

చదువుల (బంగారు) తల్లి

మెడిసిన్‌లో ఏడు బంగారు పతకాలు అందుకున్న పార్వతి

సామర్లకోట, అక్టోబరు 6: కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబీ బీఎస్ పూర్తిచేసిన సామర్లకోటకు చెందిన చంద్రాభట్ల పార్వతి ఎన్టీఆర్ యూనివర్సిటీ పరిధిలో రెండో ర్యాంకర్‌గా నిలిచింది. శనివారం రాత్రి రంగరాయలో జరిగిన కళాశాల 66వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్, డీఎంఈ డాక్టర్ డీఎస్వీఎల్ నరసింహం నుంచి ఏడు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందుకుంది. కంచి మహా సంస్థానం వ్యవస్థాపకుడు చంద్రాభట్ల చింతామణి గణపతి శాస్త్రి సోదరుడు, చంద్ర షిప్పింగ్ ఏజన్సీస్ మేనేజింగ్ పార్టనర్ చంద్రాభట్ల పతంజలి శాస్త్రి మూడవ కుమార్తె పార్వతి. భవిష్యత్తులో జెనెటిక్ మెడిసిన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలన్నదే తన లక్ష్యమని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో హౌస్ సర్జన్‌గా సేవలందిస్తున్న పార్వతి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పింది.

పొలానికి బయల్దేరి... తిరిగిరాని లోకాలకు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తొండంగి, అక్టోబరు 6: ఉదయం పొలానికి బయల్దేరిన వ్యక్తి అక్కడకు వెళ్లేలోపే మృత్యుఒడికి చేరుకున్నాడు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి వద్ద ఆదివారం జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... గొర్సపాలెం గ్రామానికి చెందిన నేమాల ఉప్మాక (50) ఆదివారం ఉదయం తొండంగి సమీపంలో ఉన్న పొలానికి మోటారు సైకిలుపై ఇంటి నుంచి బయల్దేరాడు. ఒంటిమామిడి సెంటరులో బీచ్ రోడ్డు నుంచి తొండంగి రోడ్డులోకి రాగా వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. లారీ చక్రాలు అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య కొండమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎడ్ల బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఉప్మాక మరణంతో ఆ కుటుంబానికి ఆసరా లేకుండా పోయిందని బంధువులు వాపోతున్నారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో కిరాతకంగా నరికి...

తమ్ముడిని చంపిన అన్నయ్య... తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో ఘటన

తాళ్లరేవు, అక్టోబరు 6: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో అన్నదముల మధ్య ఆస్తి వివాదం ఒకరి హత్యకు దారితీసింది. తమ్ముడిని అన్నయ్య చంపేయడంతో ఈ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పి.మల్లవరానికి చెందిన వెంటపల్లి ఏడుకొండలు, నూకరాజు అన్నదమ్ములు. వీరి తండ్రి నాగభూషణం ఇంత క్రితమే మరణించాడు. తల్లి నాగరత్నం ఇటీవలే మృతి చెందింది. అన్నదమ్ములిద్దరూ వారి కుటుంబాలతో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వారికున్న మూడు ఎకరాలు, ఇంటి స్థలాన్ని రెండో కుమారుడు నూకరాజు (47) పేరున తల్లిదండ్రులు పూర్వమే రాసేశారు. దీంతో అన్నదమ్ముల మధ్య వివాదాలు చోటుచేసుకుని గొడవలు ముదిరిపోయి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. చాలాసార్లు కోరింగ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఆదివారం ఉదయం తమ్ముడు నూకరాజు ఇంటి దగ్గర తోటలో కొబ్బరి కాయలు తీయిస్తుండగా అన్నయ్య ఏడుకొండలు వెనుక నుంచి కత్తిపట్టుకుని వచ్చాడు. కుటుంబ సభ్యులు, కొబ్బరికాయల కొనుగోలుదారులు చూస్తుండగానే తమ్ముడిని అన్నయ్య కత్తితో అతి కిరాతకంగా నరికి పరారయ్యాడు. నూకరాజు తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ, కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన నూకరాజు (పాత చిత్రం)

దొమ్మేరు సొసైటీలో చోరీ



కొవ్వూరు, అక్టోబరు 6: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. సొసైటీ కార్యదర్శి కేఎస్ఆర్‌వీఎస్ఎల్ఎన్‌వీ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... సిబ్బంది ఈ నెల 5వ తేదీన ప్రతిరోజూ మాదిరిగా సొసైటీకి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఎరువులను విక్రయించడానికి సేల్స్‌మెన్ ఎంఎస్ రాయుడు, హమాలీ ఎస్.గణపతి సొసైటీ గొడౌన్ ఓపెన్ చేయగా దొంగతనం జరిగిందని గుర్తించి సమాచారం అందించారు. గొడౌన్ వెనుకవైపు కిటికీని తొలగించి రూ. 10వేల నగదు దొంగిలించారు. భవనం మొదటి అంతస్తులో ఉన్న కార్యాలయ వెనుక కిటికీని తొలగించి లోపలికి ప్రవేశించి సీసీ కెమెరాల డీవీఆర్, బీఎస్ఎన్ఎల్ మోడెం దొంగిలించుకుపోయినట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విశ్వం సంఘటనాస్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. సొసైటీ కార్యదర్శి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏ తల్లి పేగు బంధమో!

చెత్తకుప్పలో పసికందు మృతదేహం



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 6: తల్లి పొత్తిళ్లలో వెచ్చగా నిదురించాల్సిన పసికందు కంపు కొట్టే చెత్తకుప్పలో విగతజీవిగా పడి ఉంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం తుమ్మలావలోని జయరాం థియేటర్ సెంటర్లో ఆది వారం ఈ దారుణం చోటుచేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో రోడ్డు పక్కనే చెత్తలో బొడ్డూడని ఆడ శిశువు మృతదేహం కనిపించింది. దీనిని చూసిన స్థానికులు నిర్ఘాంతపోయారు. బతికివుందని దగ్గరకు వెళ్లి చూడగా మృతదేహమని నిర్ధారించుకున్నారు. ఇది అక్కడి మాతృమూర్తులను కదిలించింది. ఆడబిడ్డను, అందులోనూ బొడ్డుకూడా ఊడని పసి కందును చూసి తల్లుల కళ్లు చెమర్చాయి. శిశువు శరీరాన్ని ఈగలు, చీమలు పట్టి ఉండడం చపరులను కదిలించింది. ఈ విషయాన్ని త్రీటౌన్ పోలీసులకు తెలియజేయడంతో సీఐ అప్పారావు సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. పసికందు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పుట్టిన వెంటనే శిశువు మరణించి ఉంటుందని, అనంతరం చెత్తకుప్పలో పడేసివుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వివాహం కాకుండా గర్భిణి కావడం, మరేదేనా కారణంతో పడేసి ఉంటారా... ఈ ప్రాంతంలోని వారా లేక బయటి నుంచి వచ్చి ఇక్కడ వదిలేశారా అన్న కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు.

ఏవోబీలో విస్తృత తనిఖీలు

మోతుగూడెం, అక్టోబరు 6: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. సీఆర్‌పీఎఫ్ క్యాంపులను అప్రమత్తం చేశారు. వై.రామవరం మండలం డొంకరాయిలో ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు ఏరియా డామినేషన్ నిర్వహించారు. ఆంధ్రా నుంచి ఒడిశా వెళ్లే రహదారిలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి అనుమానితులను ప్రశ్నిస్తున్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివకుమార్, సిబ్బంది

సముద్రంలో స్నానానికి దిగిన యువకుని మృతి

తొండంగి మండలం వేమవరంలో ఘటన

తొండంగి, అక్టోబరు 6: సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. కాకినాడ జిల్లా తుని మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఉరుకుట్టి చంటి (24) సోమవారం స్వామి మాలధారణలో భాగంగా సముద్ర స్నానం చేసేందుకు స్నేహితులతో పాటు వేమవరం వెళ్లాడు. స్నానం చేస్తూ మునిగిపోగా మత్స్యకారులు అతడిని బయటకు తీశారు. తునిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి తల్లి రమణమ్మ, తండ్రి గోవిందు ఉన్నారు. గ్రామంలో టైలర్‌గా జీవనం సాగిస్తున్న చంటి అందరితో చనువుగా మసలేవాడని, జూనియర్ ఎన్టీఆర్‌కు వీరాభిమానిగా ఉండేవాడని సన్నిహితులు చెప్పారు.



మృతుడు చంటి (పాత చిత్రం)

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 6: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్, అనంతరం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

అర్బన్ సొసైటీ ఎన్నికల్లో కూటమి విజయం

నాలుగు స్థానాల్లో కూటమి, ఒక స్థానంలో ఇండిపెండెంట్ గెలుపు

మర్రెడ్డి, పెండెంలను కలిసిన 1వ వార్డు డైరెక్టర్ రాంబాబు


జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డిని కలిసిన రాంబాబు

పిఠాపురం, అక్టోబరు 6: పిఠాపురం అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ (పూర్వ పిఠాపురం అర్బన్ బ్యాంకు) ఎన్నికల్లో కూటమి విజయం సాధించింది. కూటమి పార్టీల తరఫున నలుగురు అభ్యర్థులు విజయం సాధించగా, ఒక స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. ఎన్నికల్లో 5 డైరెక్టరు పదవులకు 12మంది అభ్యర్థులు రంగంలో నిలిచారు. ఆదివారం పోలింగ్ జరిగింది. సొసైటీలో 2011మంది ఓటర్లు ఉండగా 981మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 48.78శాతం పోలింగ్ నమోదైంది. అనంతరం ఓట్ల లెక్కింపును చేపట్టి విజేతల వివరాలను ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ ప్రకటించారు. 1వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పూర్వ చైర్మన్ బాలిపల్లి రామచంద్రకుమార్ (రాంబాబు) 51ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, కూటమి మద్దతుతో పోటీ చేసిన 2వ వార్డు అభ్యర్థి చెల్లుబోయిన ప్రమీల 41ఓట్లు, 3వవార్డు అభ్యర్థి అద్దంకి వెంకటరమణ 101ఓట్లు, 4వ వార్డు అభ్యర్థి అరిగెల ప్రసాద్ 156ఓట్లు, మేళం రామకృష్ణ 104ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

ఒకరికి భంగపాటు

టీడీపీ, జనసేన పార్టీల మద్దతుదారులు ఎన్నికల్లో నిలిచినా ఇరుపార్టీల అధినేతల సూచనల మేరకు కూటమి తరపున ఐదుగురు అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో 1,3 వార్డుల నుంచి టీడీపీ బలపరచిన అభ్యర్థులు, 2,4,5 వార్డులు నుంచి జనసేన బలపరిచిన అభ్యర్థులు పోటీలో నిలవగా ఒకటవ వార్డు అభ్యర్థి మాత్రం ఇండిపెండెంట్ చేతిలో పరాజయం పాలయ్యారు. ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం జనసేనకు చైర్మన్ పదవి, టీడీపీకి వైస్‌చైర్మన్ పదవి దక్కుతుంది. 1,2 వార్డుల్లో మాత్రం హోరాహోరీ పోరు సాగగా, 3,4,5 వార్డుల్లో ఎన్నిక ఏకపక్షంగా జరిగింది. 1వ వార్డు నుంచి డైరెక్టరుగా విజయం సాధించిన బాలిపల్లి రామచంద్రకుమార్(రాంబాబు) ఆదివారం రాత్రి పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులను కలిశారు. కాగా కూటమి అభ్యర్థి ఓటమికి కారణమైన రాంబాబును జనసేన నేతలు కలవడంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జనసేన సంబరాలు

అర్బన్ సొసైటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడంతో పిఠాపురంలో జనసేన నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. విజయం సాధించిన కూటమి అభ్యర్థులతో కలిసి నేతలు కోటగుమ్మం సెంటర్ నుంచి ఉప్పాడ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుల హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ భారీ మెజార్టీలు ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం సొసైటీని అభివృద్ధి పథంలో పయనింపచేసి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. కూటమి పట్ల నమ్మకం ఉంచి గెలిపించిన సొసైటీ సభ్యులకు, విజయానికి కృషి చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. జనసైనికులు ఉన్నారు.

రేపు సామర్లకోటలో మినీ జాబ్‌మేళా

సామర్లకోట, అక్టోబరు 6: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 8న సామర్లకోట టీటీడీసీ ఆవరణలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాస్, సీడాప్ మేనేజరు కిరణ్ తెలిపారు. ఆదివారం సామర్లకోట టీటీడీసీ ఆవరణలో వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు బ్లూఓషియన్, బయోటెక్, పేటీఎం, ఇన్నోవ్‌సోర్స్, జీ-పే సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ ఫిట్టర్, ఏదైనా డిగ్రీ పూర్తిచేసి 18 నుంచి 35ఏళ్ల యువతీ యువకులు అర్హులని, ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరవ్వాలన్నారు. మరింత సమాచారం కోసం 9949156583కి సంప్రదించాలని కోరారు. కొండలరావు తదితరులున్నారు.

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పెళ్లికానుక

జగ్గంపేట, అక్టోబరు 6: మండలంలోని ఇర్రిపాక గ్రామంలో కొత్తపల్లి రమణ కుమార్తె అనూష భూషణరావు వివాహ వేడుకలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పెళ్లికానుక రూ.20వేలు చెక్‌ను ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి అందజేశారు. ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడబిడ్డలకు వివాహం జరిపించే సమయంలో తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో ఫౌండేషన్ ద్వారా రూ.20వేలు ఆర్థికంగా సహాయం చేస్తున్నామన్నారు. పెళ్లికి 9రోజుల ముందు ఫౌండేషన్ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బస్వా చినబాబు, పంతం సత్యనారాయణ, జ్యోతుల సత్యమూర్తి, కోనేటి వెంకటేశ్వరరావు, జ్యోతుల వీరభద్రరావు, ఫౌండేషన్ కమిటీ సభ్యులు గద్దె మారుతి, పుర్రె సూరన్న,ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

పిఠాపురం, అక్టోబరు 6: కలసి చదువుకున్న వారంతా 31ఏళ్ల తర్వాత మళ్లీ ఒకేచోట కలుసుకున్నారు. జ్ఞాపకాలతో తడిచి ముద్దయ్యారు. పట్టణంలోని ఏకేపీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక హోటల్ వేదికగా కలుసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లరి, చదువు, ఇలా అన్ని విషయాలు గుర్తుకు తెచ్చుకున్నారు. ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపిన వీరంతా భారమెక్కిన హృదయాలతో పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా కలవాలని నిర్ణయించుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు, ఆసుపత్రి చైర్మన్‌కు సత్కారం

ఏలేశ్వరం, అక్టోబరు 6: మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన తూము రౌతు శ్రీనివాసరావు, ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి చైర్మన్‌గా ఎంపికైన వాగు రాజేష్‌ను ఆదివారం స్థానిక దాకమూరి కమ్యూనిటీ హాలులో 1993-94 పదోతరగతి బ్యాచ్ స్నేహితులు శాలువా కప్పి సత్కరించి పూలమాలు వేసి మెమెంటోలు అందజేశారు. పైల సుభాష్ చంద్రబోస్, గోగుల మూర్తి, దాకమూరి లోవరాజు, శంఖిని పెంటారావు, పెంటకోట మహేష్, శిడగం రాంబాబు, ఆకుల నాగు, రాతికింద సతీష్, కోడూరి మహేష్, సింహాచలం, కంచర్ల రాజేష్, తాడి ఎను, కె.వాసు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ టెట్ పరీక్షలు

గండేపల్లి, అక్టోబరు 6: సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ఆదివారం ఏపీ టెట్ 2024 ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 220మందికి గాను 186మంది హాజరుకాగా 34మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 224మందికి గాను 185మంది హాజరుకాగా 39 మంది గైర్హాజరయ్యారని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

లలితాదేవిగా దర్శనం

ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు


పెద్దాపురం భువనేశ్వరీ పీఠంలో లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

సామర్లకోట, అక్టోబరు 6: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరులచే వేదమంత్రోచ్చారణల మధ్య పుష్పార్చన పూజలు చేశారు. అమ్మవారిని లలితాదేవిగా సర్వాంగసుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించారు. సామర్లకోట గ్రామ దేవతగా ప్రసిద్ధి పొందిన నూకాంబికా అమ్మవారికి మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. దీపారాధన సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో వివిధ రంగులతో కూడిన వస్త్రాలతో తయారుచేసిన గులాబీలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు.

పెద్దాపురం: పట్టణంలోని వర్తులవారి వీధిలోని భువనేశ్వరీ పీఠంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వగా పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానాల్లో ఈవోలు కె.విజయలక్ష్మీ, సౌజన్య ఆధ్వర్యంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అధికంగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పిఠాపురం: పట్టణంలోని పాదగయ క్షేత్రం కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో రాజరాజేశ్వరిదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శతచండీయాగ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. రాజరాజేశ్వరీదేవి గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాగణపతి స్వామివారికి విఘ్నేశ్వరపూజ, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, కుంకుమార్చనలు జరిగాయి. పురుహూతికాఅమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. శ్రీచక్ర నవావరణార్చన సహిత ప్రత్యేక సహస్ర పుష్పార్చనలు, శ్రీచక్ర లక్షకుంకుమార్చన, త్రిపురభైరవి విశేష అర్చనలు జరిగాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు: పట్టణంలోని కనకదుర్గమ్మ ఆలయాల్లో సహస్ర కుంకుమార్చనలు, విశేషపూజలు జరిగాయి. కరణంగారితోట, ఈబీసీకాలనీ,దేవినగర్, కొత్తపేట, మార్కండేపురం తదితర ప్రాంతాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. బస్టాండు వద్ద విజయదుర్గాదేవి లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు. పలు ఆలయాల వద్ద భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

జగ్గంపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు శ్రీదుర్గామాత లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జగ్గంపేట దేవిసెంటర్, చెరువు గట్టుపై, రావులమ్మతల్లి, సత్తెమ్మతల్లి, నూకాలమ్మతల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

తొండంగి: బెండపూడిలో విశాలాక్షి సమేత విశ్వేశ్వరుని ఆలయంలో విశాలాక్షిఅమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఏవినగరంలోని శ్రీదేవి భూదేవి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఏకొత్తపల్లి కదంబ క్షేత్రంలో భువనేశ్వరి అమ్మవారు అన్నపూర్ణగా భక్తులను అనుగ్రహించారు.

కొత్తపల్లి: కొమరగిరిలో బాలకనకదుర్గ అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. వివిధ రకాల కాయగూరలు, వరి దుబ్బులతో అలంకరించారు. అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


ప్రత్తిపాడు: ఏలూరులో బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే

బోనాల ఊరేగింపు

ప్రత్తిపాడు, అక్టోబరు 6: మండలంలోని ఏలూరులో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బోనం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మవరంలో విజయ దుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుంచి వందలాది మంది మహిళలు బోనాలతో ప్రదర్శించారు.

వీణాపాణి అవతారంలో...



పోర్టుసిటీ (కాకినాడ) అక్టోబరు 6: నగరంలో ప్రసిద్ధి చెందిన సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు భక్తులకు వీణాపాణి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖులు, కూటమి నాయకులు నేమాని వీరవెంకట సత్యనారాయణ, నల్లారి తులసి, మెత్యాల అనురాధ పాల్గొన్నారు.

రుద్రాక్షధారిణిగా లలితాదేవి



గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 6: దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి సన్నిధిలో కొలువైన లలితాదేవి రుద్రాక్షధారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించి రుద్రాక్షలతో అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి


రౌతులపూడి ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు

రౌతులపూడి, అక్టోబరు 6: గతంలో పోలీస్‌స్టేషన్ లేక ఇబ్బందులు పడ్డాం... ప్రస్తుతం అమ్మవారి గుడికి దగ్గరలోనే పోలీస్‌స్టేషన్ ఉంది ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు పోలీసులను కోరుతున్నారు. రౌతులపూడిలో సినిమా సెంటర్, దుర్గాదేవి ఆలయ సమీపంలో రోజుకు ట్రాఫిక్ పెరిగిపోతుంది. దసరా ఉత్సవాలు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి రౌతులపూడి వచ్చే ప్రజలు ట్రాఫిక్‌లో ఇరుక్కుని అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాలు, ద్విచక్రవాహనాలు రహదారికి అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తప్పడంలేదు. ముఖ్యంగా రౌతులపూడి ఆసుపత్రి నుంచి అంబులెన్సుల్లో రోగులను తరలించే సమయంలో ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు తక్షణం స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న 'పద్మావతి పరిణయం'


కాకినాడలో నృత్యరూపకం ప్రదర్శిస్తున్న దృశ్యం

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 6: సరస్వతి గానసభ 121వ వార్షిక దసరా, సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన పద్మావతి పరిణయం నృత్యరూపకం అలరించింది. కాకినాడ సూర్యకళామందిరలో బీవీఆర్ శర్మ బృందం సభ్యులు ఆదివారం రాత్రి నిర్వహించిన నృత్యరూపకం చూపరులను ఆకట్టుకుంది. సరస్వతి గానసభ జీవితకాల చైర్మన్ కొమ్మిరెడ్డి శ్రీరామ నరసింగరావు, గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, అధ్యక్షుడు కేవీఎస్ ఆంజనేయమూర్తి, ఉపాధ్యక్షుడు లక్కరాజు సత్యనారాయణ (టిక్కు), కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, సహాయ కార్యదర్శి చెరుకువాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెద్దబాలశిక్ష రూపంలో పెళ్లి పత్రిక!

కరప, అక్టోబరు 6: కరపకి చెందిన టీడీపీ నేత కాకర్ల త్రినాథసాయికుమార్, భువనేశ్వరి దంపతులు తమ కుమార్తె లక్ష్మీపావనికి బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన పాలచర్ల సాయివినయ్ అనే వ్యక్తితో ఈనెల 16న వివాహం చేయడానికి నిశ్చయించారు. ఆహ్వానపత్రికను వెయ్యి పేజీలు ఉన్న పెద్దబాలశిక్ష-2 పుస్తకంలో కవర్ పేజీగా ముద్రించారు. ఈ ఆహ్వాన పత్రికను స్నేహితులు, బంధువులకు అందజేసి కుమార్తె వివాహ వేడుకకు రావాలని ఆ దంపతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



చొల్లంగిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, అక్టోబరు 6: ప్రకృతి పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడితే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఆదివారం చొల్లంగి మడఫారెస్ట్‌లో వన్యప్రాణి వారోత్సవాలు ముగింపు సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అడవులను నరికివేయడం, ప్రతీచోట చెట్లను అధికంగా తొలగించేస్తున్నారని వాటి పర్యవసానాన్ని ప్రజలంతా చవిచూస్తున్నారన్న విషయం గమనించాలన్నారు. చెట్లను నరకకుండా కాపాడితే అవి మనకు ఆక్సిజన్‌ను అందిస్తాయన్నారు. 18 ఈడీసీలకు టూరిజం నిధులు రూ.2లక్షలు చొప్పున రూ.36లక్షలు చెక్కును కమిటీల చైర్మన్లకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో రేంజర్ ఆఫీసర్ వరప్రసాదరావు, ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, గుర్రే లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

తాళ్లరేవు మండలంలో కోస్టల్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు వైద్యులు సహకరించాలని ఆసుపత్రి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఆదివారం తాళ్లరేవు 30పడకల ఆసుపత్రిని పరిశీలించి వైద్యులతో సమావేశమై చర్చించారు. ఆసుపత్రిలో సమస్యలు, అవసరాలను సూపరింటెండెంట్ డాక్టర్ స్నేహలత, అభివృద్ధి కమిటీ సభ్యులు రోల్ల చక్రవర్తి, అత్తిలి బాబూరావు, వాకపల్లి సరోజనీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ డెలివరీ కేసులన్నీ ఇక్కడే చేయాలని, కాకినాడ రిఫర్ చేయవద్దన్నారు. రోగులతో వైద్యులు సక్రమంగా ప్రవర్తించకపోయినా, వైద్యసేవలను నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు, మోపూరి వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, పెమ్మాడి కృష్ణవేణి, వైద్యసిబ్బంది ఉన్నారు.

అభివృద్ధిని విస్మరించిన డిప్యూటీ సీఎం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు


పిఠాపురంలో రోడ్లపై నిలిచిన మురుగునీటిని చూస్తున్న మధు, నాయకులు

పిఠాపురం, అక్టోబరు 6: రాజకీయ ప్రాబల్యం పెంచుకోవడం కోసమే సనాతన ధర్మం అంటూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాలయాపన చేస్తున్నారని, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. పిఠాపురంలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం, రోడ్లపై నిలిచిన మురుగునీరు ఉన్న ప్రాంతాలను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం యానాదుల కాలనీలో కె.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని పవన్‌ను భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. గెలిచి 3 నెలలు దాటిందని, ఒక్కసారి మాత్రమే నియోజకవర్గానికి వచ్చారని చెప్పారు. 3 నెలల్లో నియోజకవర్గంలో లేదా కాకినాడ జిల్లాలో ఒక అభివృద్ధి పనికి శంఖుస్థాపనా జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. ఇసుక అందుబాటులో నిర్మాణాలు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని.. కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాకా రామకృష్ణ, లక్ష్మీనారాయణ పాదాలు, మేకల సుబ్బారావు, మర్రి లోవలక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలి

కాకినాడ సిటీ, అక్టోబరు 6: ప్రతిఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటించాల్సిన అవసరం ఉందని, దాని వల్ల కుటుంబంతోపాటు సమాజానికి ఎంతో మేలు చేసిన వారవుతారని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి డాక్టర్ ఐవీ రావు అన్నారు. భరద్వాజ సేవా సంఘం కాకినాడ ఆధ్వర్యంలో నగరంలోని ప్రముఖ వైద్యులతో ఆదివారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించగా ఐవీ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ సమాజ క్షేమం కాంక్షించే వేద పండితుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వేదపండితులు, బ్రాహ్మణులు, పురోహితులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వాడ్రేవు రవి, సంఘ ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరరావు ప్రసంగించారు. సంఘ ఉపాధ్యక్షుడు అయ్యగారి వెంకటేష్, కోశాధికారి రంగాభట్ల శ్రీనివాస్, జీవీ కృష్ణప్రకాష్, చల్లా శ్రీనివాస్ నిరంజన్, మండలిక శాస్త్రి, శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవాసంఘం అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి ప్రొద్దుటూరు బాలాజీ విశ్వనాథ శర్మ, కోశాధికారి కప్పగంతుల సాయిరామ్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!


పెద్దాపురంలో ప్రమాదకరంగా ఉన్న ఎంసీబీ బాక్సు

పెద్దాపురం, అక్టోబరు 6: స్థానిక మెయిన్ రోడ్డులో గాయత్రీ గ్యాస్ ఏజెన్సీస్ సమీపంలో ఉన్న విద్యుత్ స్థంభానికి కిందన ఉన్న ఎంసీబీ బాక్సు ప్రమాదకరంగా ఉంది. బాక్సుకి ఉన్న తలుపు బయటకు ఊడిపోయి ఉండడం, పైగా చిన్నపిల్లలకు చేతికందే ఎత్తులో ఉండడంతో మరింత భయాన్ని కలిగిస్తోంది. నిత్యం దాని పక్కనుంచే వందలాది వాహనాలు, ప్రజలు దాని పక్కగా వెళ్తుంటారు. అనుకోని ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని పలువురు ప్రశ్నిస్తున్నారు. తక్షణం విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం!

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 6: భానుగుడి వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. భానుగుడి నుంచి టూటౌన్ వెళ్లేటప్పుడు భానుగుడి వైపు బ్రిడ్జి మొదట్లో రోడ్డంతా అధ్వానంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ బ్రిడ్జిపై గోతులను వారం క్రితం బూడిదతో పూడ్చినప్పటికీ మళ్లీ గోతులతో దర్శనమిస్తోంది. అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


కాకినాడలో భానుగుడి వంతెనపై గోతులు

వేడుకగా సత్యదేవుడి రథోత్సవం


సత్యదేవుడి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, అక్టోబరు 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆర్జితసేవ అయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు పండితులు వేదమంత్రాలతో స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తోడ్కొనివచ్చి సుగంధ భరిత పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ ఐవీరామారావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు


న్యాయమూర్తికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

తునిరూరల్, అక్టోబరు 6: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చిమలపాటి రవి పూజలాచరించారు. కుటుంబసమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ ఈవో పి.విశ్వనాథరాజు ఆధ్వర్యంలో పండితులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం పండితులు వేద ఆశీర్వచనాలు అందజేసి అమ్మవారి మహా ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. న్యాయమూర్తి వెంట స్థానిక కోర్టు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కే.బాలకోటేశ్వరావు, తహశీల్దార్ ప్రసాద్, ఎస్ఐ కృష్ణమాచారి పాల్గొన్నారు.

వైభవంగా గాలిగంగాలమ్మ జాతర

పిఠాపురం, అక్టోబరు 6: పట్టణంలో గాలిగంగాలమ్మ జాతర వైభవంగా జరిగింది. ఆలయం వద్ద గరగనృత్యాలు, శక్తివేషధారణలు, తీన్‌మార్ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. భారీఎత్తున బాణసంచా కాల్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'బాణసంచా నిల్వ ఉంచితే చర్యలు'

జగ్గంపేట, అక్టోబరు 6: రానున్న దీపావళి పండుగ పురస్కరించుకుని అక్రమంగా బాణసంచా నిల్వ చేస్తే చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచరాదన్నారు. ఇంటి పరిసరాల్లో బాణసంచా తయారు చేసినా, నిల్వఉంచినా చర్యలు తప్పవన్నారు. బాణసంచా అక్రమ తయారీపై 9440796529 నెంబర్‌కు లేదా కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి ఎస్ఐలకు తెలియజేయాలని కోరారు.

సారా బట్టీలపై దాడులు

ప్రత్తిపాడు, అక్టోబరు 6: మండలంలోని టిరాయవరంలో సారా బట్టీలపై ఆదివారం ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం దాడులు నిర్వహించారు. 300లీటర్ల పులిసిన బెల్లపు ఊటను పోలీసు సిబ్బంది ధ్వంసం చేశారు. మండలంలోని సారా తయారీ అమ్మకాలతో పాటు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఐరన్ బడ్డీ అందజేత

కాకినాడ సిటీ, అక్టోబరు 6: అగ్ని ప్రమాదంలో బడ్డీ కొట్టు కాలిబూడిదై జీవనాధారం కోల్పోయిన వరలక్ష్మి అనే మహిళకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం అందించారు. కాకినాడ టూటౌన్ ఓవర్‌బ్రిడ్జి దిగువన గాటిలమ్మ అమ్మవారి గుడి వద్ద బాధితురాలికి ఐరన్ బడ్డీని అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, ఎల్ఐసీ మేనేజర్ కిరణ్,మాజీ కార్పొరేటర్ బలువూరి రామకృష్ణ పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్ట్

కాకినాడ క్రైం, అక్టోబరు 6: గుట్టుచప్పుడుగా పేకాడుతున్న ఏడుగురిపై కాకినాడ వన్‌టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసి అరెస్ట్ చేశారు. కాకినాడ తిలక్‌వీధిలో పేకాట జరుగుతోందని సీఐ నాగదుర్గారావుకు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఆయన బృందం ఆ వీధిలో ఓ ఇంటిపై మెరుపు దాడి చేయగా పేకాడుతున్న ఏడుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.16,040 నగదు, 7 మొబైల్‌ఫోన్‌లు, ఐదు మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఏడుగురిని సోమవారం ఉదయం కోర్టులో హాజరుపర్చనున్నామన్నారు.

గుర్తుతెలియని మృతదేహం కలకలం

తునిరూరల్, అక్టోబరు 6: ఎస్.అన్నవరం గ్రామ శివారు గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. ద్వారకనగర్ లే అవుట్‌లో సుమారు 25 ఏళ్ల వ్యక్తి మృతిచెందినట్టు పోలీసులు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా మారడంతో వివరాలు కనుక్కోవడం కష్టంగా మారింది. మృతికి గల కారణాలు అన్ని కోణల్లో అన్వేషిస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

ఉపవాస కూడికల సభలు

సామర్లకోట, అక్టోబరు 6: మండలంలో పనసపాడు గ్రామంలో యెహోవాయిరే ప్రార్థనా మందిరంలో 3 రోజులుగా నిర్వహించిన ఉపవాస కూడికల సభలు ఆదివారం ముగిశాయి. పాస్టర్లు డేవిడ్‌రాజు, సంతోష్‌కుమార్, ఇమ్మాన్యుయెల్, యాదిద్య దేవుని సంఘ విశిష్టతపై ప్రసంగించారు. సంఘ విశ్వాసకులు ఎన.ప్రభుదాసు, సంఘ సభ్యులతో సామూహిక ప్రార్థనలు, ఆత్మీయవిందు నిర్వహించారు.


పనసపాడులో ఉపవాస కూడిక దృశ్యం